సంక్రాంతికి ఊరెళ్లేవారు
జాగ్రత్త!

చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్



చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్

చిక్కడపల్లి,జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఊరెళ్లే చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు పలు జాగ్రత్తలు చేపట్టాలని ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ సూచించారు. ఊరెళ్లే విషయం సోషల్ మీడియాల్లో పెట్టవద్దని, విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో పెట్టాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ వాడాలని, ఇంటిలోపల ఒక లైట్ ఆన్‌లో ఉంచాలని, తాళం కనబడకుండా డోర్‌కర్టెన్ వేయాలని, వాహనాలను ఇంటి ఆవరణలోనే సురక్షిత ప్రాంతంలో పెట్టి లాక్ పక్కాగా వేయాలని ప్రజలకు సూచించారు. అయితే డాక్యుమెంట్లను వాహనంలో పెట్టవద్దని సూచించారు. ఇంటికి మంచి మెగా పిక్సెల్ సీసీ కెమెరాలు అమర్చుకుని ఆన్‌లైన్ సౌకర్యాన్ని కలిగి 'మీ మొబైల్‌కి అనుసంధానం(లైవ్) చేసుకోవాలి' అన్నారు. క్వాలిటీ తాళాలు మాత్రమే వాడాలని, లోపలి రూమ్‌లకు కూడా తాళాలు వేయాలని, అల్మారాకి తాళంవేసి తాళం చెవులు వెంట తీసుకువెళ్లాలని, ఇంట్లో ఉంచరాదన్నారు. ఇంటి అన్ని కిటికీల డోర్స్ జాగ్రత్తగా పెట్టాలని, గ్రిల్స్ కూడా చెక్ చేసుకోవాలన్నారు. ఇంట్లోకి పనిమనుషులను, పాలు, పేపర్, వారిని రావొద్దని చెప్పాలని, లాక్డ్‌హౌస్ సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు అందించాలని, విలువైన వస్తువుల సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని తెలిపారు. తగిన ఆధారాలు తీసుకుని కుటుంబ నేపథ్యం గత ప్రవర్తన, నమ్మకమైన వాచ్‌మెన్‌ను మాత్రమే నియమించుకోవాలని. స్థానిక పీఎస్‌నెంబర్ సంబంధిత పోలీసు అధికారులు బీట్ కానిస్టేబుల్ నెంబర్ కలిగి ఉండాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

అప్రమత్తత చాలా అవసరం

అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ డి.అశోక్



అంబర్‌పేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ డి. అశోక్ పీఎస్ పరిధిలో నివసించే ప్రజలకు సూచించారు. పండుగకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు వెంటనే తెలియజేయాలని ఆయన కోరారు. దొంగతనాలను నివారించడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మార్కెట్లకు సంక్రాంతి శోభ


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన మల్లికార్జున స్వామి దేవాలయం

● జోరుగా పతంగుల అమ్మకాలు ● పిండివంటలకు భలే గిరాకీ ● మల్లన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

ముషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ అనగానే అందరికీ రెపరెపలాడే పతకంగులు, కరకలాడే సకినాలు, నువ్వుల లడ్డూలు, ప్రసిద్ధిగాంచిన భోలక్‌పూర్ బాకారంలోని బ్రహ్మారాంభ మల్లికార్జున స్వామి(మల్లన్న) దేవాలయ బ్రహ్మోత్సవాలు గుర్తుకొస్తాయి. రెండురోజుల ముందుగానే ముషీరాబాద్‌లో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. పతంగుల విక్రయాలకు ప్రసిద్ధిగాంచిన ఏక్‌మినార్‌లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 వరకు పతంగులను చిన్నారులు, పెద్దలు కొనుగోలు చేస్తున్నారు. రంగురంగుల పతంగులు ఈ సంవత్సరం వెరైటీగా తయారు చేశారు. బట్టతో తయారు చేసిన పతంగులు, ప్లాస్టిక్ కవర్‌తో చేసిన పతంగులు, పేపర్‌తో తయారు చేసిన పతంగులకు డిమాండ్ అధికంగా ఉంది. రూ.10 నుంచి మొదలుకుని రూ.250 వరకు పతంగుల సైజ్‌ను బట్టి ధరలకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. వీటితోపాటు దారం, మాంజా, చెరకులను సైతం కొనుగోలు చేస్తున్నారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పతంగులను కొనుగోలు చేసేందుకు ఏక్‌మినార్‌కు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొన్నది.


ముషీరాబాద్ ఏక్‌మినార్‌లో జోరుగా పతంగుల అమ్మకాలు



జోరుగా పిండి వంటకాల విక్రయం

సంక్రాంతి పండుగ అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది సకినాలు, నువ్వుల లడ్డూలు, గారెలు తదితర పిండివంటలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తారు. దీంతో ముషీరాబాద్‌లోని స్వీట్‌షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. సకినాలు కిలో రూ.360నుంచి మొదలుకుని రూ.400వరకు విక్రయిస్తున్నారు. నువ్వుల లడ్డూ సైతం కిలో రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులను ఆకర్షించేలా షాపులను ముస్తాబ్ చేశారు.


సంక్రాంతి పండుగ సందర్భంగా పిండివంటల అమ్మకాలు

మల్లన్న బ్రహ్మోత్సవాలు..

భోలక్‌పూర్ డివిజన్‌లోని బాకారంలో ప్రసిద్ధిగాంచిన బ్రహ్మారాంభ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఆలయానికి రంగులు వేసి రంగు రంగుల విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

వెరైటీ పతంగుల కొనుగోలు



వెరైటీ పతంగులను ప్రజలు కొనుగోలుచేస్తున్నారు. మాంజా, దారంతోపాటు బట్టతో తయారు చేసిన పతంగులను కొనుగోలు చేస్తున్నారు. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగకు ముందుగానే అమ్మకాలు ఊపందుకున్నాయి.

- మనోజ్, పతంగుల విక్రయదారుడు

మల్లన్నకు ప్రత్యేక పూజలు



ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా బ్రహ్మారాంభ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం. ఈనెల 16 వరకు ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబ్ చేశాం.

- నల్లవెల్లి అంజిరెడ్డి, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో సంక్రాంతి వేడుకలు

రాంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు సంక్రాంతి పండగ ప్రతీక అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ వై.విష్ణుప్రియ పేర్కొన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని కళాశాల ఆవరణలో కళాశాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.


వేడుకల్లో కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు


అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లోని హైమాతి ఉన్నత పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. హరిదాసుల అలంకరణ అందర్నీ అలరించింది. విద్యార్థులు ప్రదర్శించిన సంక్రాంతి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. - **(అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి)**

పేదలు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. అక్షర సంస్థ, జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నిర్వాహకులు మల్లేష్, పాఠశాల ప్రిన్సిపాల్ మేడే దేవదాస్, స్పందన్‌రెడ్డి, గాయత్రి, తిరుప్, జనీషా, శరణ్య, అనిత, డా.ఉషారాణి, చంద్రశేఖర్‌మిశ్రా, సంగ్రాస్ భార్గవ్ పాల్గొన్నారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షుడికి కార్పొరేటర్ అభినందన

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గాంధీనగర్ డివిజన్ నూతన అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్‌ను కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అభినందించారు. కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నవీన్‌కుమార్‌ను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, శ్రీకాంత్, దామోదర్, నర్సింగ్‌రావు, కృష్ణప్రసాద్, ఆకుల సురేందర్, సత్తిరెడ్డి, దోనేటి సత్యం, సాయికుమార్, శ్రీనివాస్, నీరజ్, విజయలక్ష్మి, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ సహకారంతో సమస్యల పరిష్కారం

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ బాహూనగర్ బస్తీలో సమస్యలను జీహెచ్ఎంసీ కమిషనర్ సహకారంతో పరిష్కరించామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఇటీవల ఈ బస్తీలో బస్తీబాట నిర్వహించి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే యత్నం చేశామన్నారు. వీధిలైట్లు మరమ్మతు, కొత్త కరెంట్ స్తంభాల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించామన్నారు. శనివారం సాయంత్రం బాహూనగర్ బస్తీలో ఆయన స్థానికులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లోని బస్తీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్నారని ఈ ప్రజలు ఉన్న చోట్లనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి సమస్యలు ఉన్నా కూడా బస్తీప్రజలు తమ సంస్థకు ఫిర్యాదు చేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ అధ్యక్షురాలు పద్మావతి, లక్ష్మి, జ్యోతి, రాధిక, దుర్గేష్, హేమ, శారద, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి : బీఆర్ఎస్

ముషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు భరత్‌నగర్‌లో పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, పార్టీ నాయకులు శివముదిరాజ్, శ్రీధర్‌చారి, వెంకటేష్, జి. రాజు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో బలమైన శక్తిగా బీఆర్ఎస్ : వైఎస్ఆర్

ముషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదగడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు(వైఎస్ఆర్) అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లోని 51 పోలింగ్ బూత్‌లలో ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఇన్‌చార్జి దీన్‌దాయల్‌రెడ్డి, బీసీసెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు మున్వర్ చాంద్, వంగాల నర్సింగ్‌రావు, ప్రవీణ్, మగ్బూల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ డివిజన్‌లో....

బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... ముషీరాబాద్‌లో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీకి ప్రజలు చేరువయ్యేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శివముదిరాజ్, శ్రీధర్‌చారి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలి

- ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

బర్కత్‌పుర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు లేని ఆర్టీసీగా తీర్చిదిద్దడానికి డ్రైవర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం కాచిగూడ ఆర్టీసీ బస్‌డిపోలో ఆర్టీసీ రవాణా వారోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ అవెర్నస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైడర్లు పంతులు, అమిద్, ఉత్తమ మెకానిక్ యాదవయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఆర్టీసీ బస్సులను సిగ్నల్స్ వద్ద తప్పనిసరిగా ఆపాలని బస్‌వేలో మాత్రమే నిలిపి, ప్రమాదాలను నివారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, బర్కత్‌పుర డిపో మేనేజర్ మంజుల, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ వాసవి, ట్రాఫిక్ ఏఎస్ఐ అనిల్ గౌడ్, సిబ్బంది, ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ డ్రైవర్లను సత్కరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

ముషీరాబాద్ ఆర్టీసీ డిపోలో..

రాంనగర్: జాతీయ రోడ్డు భద్రత మహాసభల్లో భాగంగా శనివారం ముషీరాబాద్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్ల భద్రతపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తమడ్రైవర్లను సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్రా, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, ఆర్టీసీ డిపో మేనేజర్ కిషన్‌రావు ఏఈఎం చందర్ సత్కరించారు.


భద్రతపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యముడు గురించి శతకం రాయడం విశిష్టం

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చాలావరకు శతకపద్యాలు సూక్తులు హితవచనాలు దేవతలను స్తుతిస్తూ ఉంటాయని కానీ ప్రాణాలు తీసుకుపోయే యముడు గురించి శతకం రాయడం విశిష్టమని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. శంకరనారాయణ ప్రాణాలు హరించే యముడిపై కూడా చతురతతో పద్యాలు రాసి పాఠకులను అలరించారని అభినందించారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో పత్రికా రచయిత డా.శంకరనారాయణ రచించిన యమ ధర్మరాజ శతకం ఆవిష్కరణ సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ శతకంలోని ప్రతి పద్యం భాషా సౌందర్యంతో ఉందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ అక్రమంగా ధనం ఆర్జించే వారి పట్ల యముడు నిఘా ఉంటుందని ఆయన దృష్టినుంచి తప్పించుకోలేరని శంకరనారాయణ తన శతకపద్యాల్లో సున్నిత హాస్యంతో చెప్పారన్నారు. శంకరనారాయణ తన శతకాన్ని సీతం కళాశాల(చిత్తూరు) ప్రొఫెసర్ సాంబశివరావుకు అంకితమిచ్చారు. శంకరనారాయణ మాట్లాడుతూ గానసభలో తన రచనలు ఎన్నో ఆవిష్కరణ జరిగాయని, ఇందుకు సహకరించిన జనార్దనమూర్తికి ధన్యవాదాలు తెలిపారు. పాటల రచయిత రామారావు విశ్వేశ్వరరావు శతకంలోని కొన్ని పద్యాలు రాగయుక్తంగా గానం చేశారు.


సంపుటిని ఆవిష్కరిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, కళా జనార్దనమూర్తి తదితరులు

మంత్రి దామోదరకు జీవో 317 బాధిత ఉద్యోగులు, టీచర్ల జేఏసీ వినతి

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వీలైనంత త్వరలో స్థానికత కోల్పోయిన వారిని తిరిగి వారి స్థానిక జిల్లాలు, జోన్లకు కేటాయించాలని కోరుతూ జీవో 317 బాధిత ఉద్యోగులు, టీచర్లు, జేఏసీ నాయకులు విజయ్‌కుమార్, సందీప్ ఆధ్వర్యంలో జీవో 317 క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. మంత్రి స్పందించి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో స్థానికత అంశంపై ఉన్న సందిగ్ధతను తొలగించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే ఉద్యోగ ఉపాధ్యాయులకు రేజనలైజేషన్ చేసి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇనిచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాముండేశ్వరి, అలివేలు, పద్మ, హరిత, జ్ఞానేశ్వర్, చందు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, ఆనంద్, శివరామకృష్ణ ఉన్నారు.


మంత్రి దామోదర రాజనర్సింహతో సమావేశమైన బాధితులు


ఇందిరానగర్‌లో ధనుష్, లోహిత్ నివాసం వద్ద గుమిగూడిన జనాలు

భోలక్‌పూర్‌లో విషాదం

ముషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన నర్సింగ్‌రావు, జయశ్రీ దంపతుల కుమారులు ధనుష్, లోహిత్ శనివారం సిద్దిపేటలోని కొండపోచమ్మ సాగర్‌కు స్నేహితులతో కలిసి వెళ్లారు. నీళ్లలో ప్రమాద వశాత్తు ఇద్దరూ కొట్టుకుపోయి మంతి చెందడంతో భోలక్‌పూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, దళితమోర్చా రాష్ట్రఉపాధ్యక్షుడు నందగిరి నర్సింహ, నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, చంద్రమోహన్, కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సంగపాక వెంకట్ మృతిచెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు గల కారణాలను వారిని అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన వారిని వెంటనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను తల్లిదండ్రులకు అందజేయాలని కోరారు.

ఘనంగా రాపత్తు ఉత్సవాలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా శనివారం స్వామివారి రాపత్తు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. 16 రకాల ప్రసాదాలతో స్వామివారికి అభిషేకించారు. భక్తులు స్వామిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో ఎస్.అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి : హైదరబాద్ సిటీ-1 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ ఆఫీస్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని చంద్రవిహార్, కేర్ ఆస్పత్రి, డాక్‌సదన్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కౌండిన్య సత్రం నూతన కమిటీ ఎన్నిక

చిక్కడపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రపరిధిలోని కౌండిన్య సత్రానికి 2025 నుంచి 2028 సంవత్సరం వరకు నూతన పాలక మండలి సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా నగరానికి చెందిన గౌడ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డమీది అనురాధగౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌడ సత్రం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కమిటీ సభ్యులతోపాటు 12 మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.


వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ తదితరులు

వడ్డెర సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

రాంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, వడ్డెర ఓబన్న ఆశయాలను నెరవేర్చాలని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ కోరారు. శనివారం డివిజన్‌లోని వడ్డెర బస్తీలో వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన వడ్డె ఓబన్న జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయికృష్ణయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గౌరీశంకర్, దర్గానర్సింగ్‌రావు, కిషోర్, వంశీ, ప్రదీప్ ప్రభాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఆధ్వర్యంలో అన్నదానం

బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి బీజెవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ, బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ గడ్డం నవీన్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

● 24న పీఓడబ్ల్యూ సమావేశం పోస్టర్ ఆవిష్కరణ


పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఈనెల 24న మంచిర్యాలలో జరగనున్న ఐక్యతా సభ వాల్‌పోస్టర్‌ను శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు ఝాన్సీ నాయకులు ప్రేమలత భారతి, పీఓడబ్ల్యూ ప్రతినిధులు పాల్గొన్నారు. - (రాంనగర్, ఆంధ్రజ్యోతి)